క్లుప్తంగా

పడకేసిన పారిశుధ్యం



పుంగనూరు నుంచి నక్కబండకు వెళ్లే దారిలో పేరుకుపోయిన చెత్త

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం పడకేసింది. ఫలితంగా దోమల మోత పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. పట్టణంలోని చర్చివద్ద, నక్కబండకు వెళ్లే దారి, తూర్పు మొగసాల, దోబీ ఘాట్, కౌండిన్య నది కాలువల్లో చెత్త, మురుగునీరు పేరుకుపోవడం, వీటిని రోజుల తరబడి తొలగించకపోవడంతో దోమల ఉత్పత్తికి ఆవాస కేంద్రాలయ్యాయి. ఆస్పత్రులకు వచ్చే జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. మరోవైపు డెంగీ కేసులు సైతం బయటపడుతున్నాయి. మున్సిపాలిటీలోని సచివాలయ ఉద్యోగులు, శానిటరీ ఉద్యోగులు సక్రమంగా పనిచేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై కమిషనర్ దృష్టి సారించి, పారిశుధ్యం మెరుగు పరచాలని కోరుతున్నారు.

కార్యవర్గం.. ఏకగ్రీవం



నూతన కార్యవర్గం

పుంగనూరు: పట్టణంలోని ప్రైవేటు స్కూళ్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, అధ్యక్షులుగా రాజమోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా షాకీరుల్లా, ప్రధాన కార్యదర్శిగా మహిపాల్‌రెడ్డి, కోశాధికారిగా మహమ్మద్ అంజాద్, సభ్యులుగా శివకుమార్‌రాజు, మహేంద్రబాబు, ద్వారకను ఎన్నుకున్నారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

వృద్ధ దంపతుల వైద్యానికి సాయం

పలమనేరు: మండలంలోని మొరం గ్రామానికి చెందిన ఆల్‌మట్టి అశోక్ హైదరాబాద్‌లోని ఓ వృద్ధ దంపతుల అనారోగ్య సమస్యలపై స్పందించారు. తమ సర్వీస్ టు సొసైటీ నెట్ వర్క్ ద్వారా సమస్యలను తెలుసుకుని వారికి రూ.4వేలను అందజేసినట్లు ఆదివారం చెప్పారు. ఎవరైనా ఆర్థిక ఇబ్బందులతో ఉంటే తమ సంస్థ పరిశీలించి వారిని ఆదుకుంటామని ఆయన పేర్కొన్నారు.

కరెంటు షాక్‌తో పాడి ఆవు మృతి



చౌడేపల్లె: కరెంటు షాక్‌కు గురై పాడి ఆవు మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం మేకలచిన్నేపల్లె గ్రామ సమీపంలోని పూల కుంట వద్ద చోటుచేసుకొంది. బాధితుడి కథనం.. గ్రామానికి చెందిన దేవిరెడ్డి పాడి ఆవులను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజు వారీ మేత కోసం పూలకుంట వద్దకు తోలుకెళ్లాడు. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా ఆవుకు వైర్లు తగలడంతో అక్కడిక్కడే కరెంటు షాక్‌కు గురై మృతిచెందింది. సుమారు రూ.80 వేలు విలువ చేసే ఆవు మృతి చెందిందని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు.

నైట్ డ్యూటీ అంటే చాలెంజ్



మహిళా వైద్యులు నైట్ డ్యూటీ చేయాలంటే చాలెంజ్ గానే ఉంటుంది. క్యాజువాలిటీ డ్యూటీలో రెస్ట్‌రూం గదులను డోర్ క్లోజ్డ్ కాకుండా గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. ఆస్పత్రుల్లో రాత్రిపూట సెక్యూరిటీ పెంచాలి. మహిళా వైద్యులు డ్యూటీలు చేసేటప్పుడు భద్రత పటిష్టంగా ఉండాలి.

-మంగమ్మ, స్టాఫ్‌నర్స్, వీ.కోట



వైద్యుల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి



ఆస్పత్రుల్లో మహిళా వైద్యుల రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. ఆస్పత్రులకు ఎలాంటి సమయంలో వచ్చినా బాధితులు, రోగుల ప్రాణాలను కాపాడడానికి వైద్యులుగా కృషి చేస్తున్నాం. వైద్యులకు రక్షణ కల్పించే విషయంలో ప్రభుత్వాలు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-డాక్టర్ మురళి, మెడికలాఫీసర్, వీ.కోట

వైద్యులకు భద్రత కరువే..



వి.కోట సీహెచ్‌సీ



తక్కువ ఎత్తులో ఉన్న ఆస్పత్రి ప్రహరీ గోడ

- రాత్రిపూట బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్న మహిళా డాక్టర్లు
- అంతమాత్రంగానే నిఘా
- ఇదీ వీ.కోట సీహెచ్‌సీ

వీ.కోట: దేవుడి తర్వాత ప్రాణం పోసే శక్తి వైద్యులకే మాత్రమే ఉంది. ఇక ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులపై ఆశలు వదులుకున్న స్థితిలో వారిని మళ్లీ సంపూర్ణ ఆరోగ్యవంతులు చేసి పునర్జన్మ ప్రసాదించిన వైద్యులకు కొదువ లేదు. అయితే ఇప్పుడు కోల్‌కతా ఉదంతం వైద్యరంగాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. ఆస్పత్రుల్లో భద్రత, రక్షణపై వైద్యులు, సిబ్బందిని ఆలోచనలో పడేస్తోంది. దీనిపై స్థానిక సీహెచ్‌సీలో వైద్య సిబ్బంది సాక్షితో తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

ఆస్పత్రి సమస్యలు

- ప్రహరీ గోడ ఎత్తు పెంచాలి
- సెక్యూరిటీ రూమ్‌ను ఏర్పాటు చేయాలి
- సరైన మరుగు దొడ్లు లేకపోవడం
- సెక్యూరిటీ సిబ్బంది సంఖ్య పెంచాలి
- డాక్టర్లు, స్టాఫ్ నర్సులకు విశ్రాంతి గదుల తగినన్ని లేవు. ఉన్న రెండు రూముల్లోనే సర్దుకోవాల్సి వస్తోంది.

వి.కోట సీహెచ్‌సీ వైద్య సిబ్బంది వివరాలు	
ఆస్పత్రి విస్తీర్ణం	: 2 ఎకరాలు
మొత్తం బెడ్లు	: 30
రెగ్యులర్, ట్రైనీ డాక్టర్లు	: ఏడుగురు
స్టాఫ్ నర్సులు	: 10 మంది
ఆస్పత్రిలో ఇతర సిబ్బంది	: 25 మంది

సెక్యూరిటీ	: ముగ్గురు
రోజువారీ ఓపీ	: దాదాపు 550
ఇన్‌పేషెంట్లు	: 20 నుంచి 25 వరకు
ప్రస్తుతం సీసీ కెమెరాలు	: 6
పనిచేయని కెమెరాలు	: 2
ఇంకనూ అవసరమైన కెమెరాలు:	10

దాడులను అరికట్టాలి



వైద్యులు, వైద్య సిబ్బందిపై జరిగే దాడులకు అడ్డుకట్ట వేయాలి. పదిమందికి ప్రాణం పోసే వృత్తిలో ఉన్న ఒక జూనియర్ డాక్టర్ కోల్‌కతాలో పనిచేసే ఆస్పత్రిలోనే లైంగికదాడి, దారుణ హత్యకు గురవడం మమ్మల్నదరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది; కలచివేస్తోంది. మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు తెచ్చినా తక్కువే. పనిచేసే చోటే రక్షణ, గౌరవం లేకపోతే ఎలా?

-ఉమే సల్మా, గైనకాలజిస్ట్, వీ.కోట

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



కోల్‌కతా ఘటన మృగాళ్లను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి. ఆస్పత్రుల్లో ప్రతి రూముకూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. మద్యం సేవించి ఆస్పత్రుల్లోకి వచ్చే వారితో కొన్ని సందర్భాల్లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మహిళా వైద్యులు ఏదైనా సమస్యలపై ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

-అశ్విని, సివిల్ అసిస్టెంట్ సర్జన్, వీ.కోట

ఆస్పత్రికి భద్రత పెంచాలి



ఆస్పత్రుల్లో మహిళా వైద్యులకు తగిన భద్రత పెంచాలి.ముఖ్యంగా నైట్ డ్యూటీ చేసే మహిళ వైద్యులకు, నర్సులకు రక్షణ విషయంలో నిశ్చింత కల్పించాలి. సెక్యూరిటీ సిబ్బందిని పెంచాలి.

-నజరత్, స్టాఫ్ నర్స్, వీ.కోట

నేటి నుంచి వరసిద్ధి వినాయక పునఃప్రతిష్ఠ మహోత్సవం

వి.కోట: స్థానిక వినాయకనగర్‌లోని శ్రీ సిద్ధిబుద్ధి పరివార సమేత శ్రీ వరసిద్ధి వినాయకస్వామి పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం సోమవారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త రామ్‌స్వరూప్ వైష్ణవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 26న సోమవారం ఉదయం 6 గంటలకు గోపూజ, గంగపూజ, గణపతిపూజ, వేదపారాయణం వాస్తు, రకాబంధన, హోమ పూజలు, 27, 28వ తేదీ నిర్వహించే వివిధ కార్యక్రమాలను తెలియజేశారు. వీటికి భక్తులు హాజరు కావాలని కోరారు.

14న జాతీయ లోక్ అదాలత్

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి శిరీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, క్రిమినల్ కేసులతో పాటు లోక్‌అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులను పరిష్కరిస్తామన్నారు. కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిప్పర్ ఢీకొని బాలుడికి గాయాలు



లోకేష్

చౌడేపల్లె: టిప్పర్ ఢీకొనడంతో బాలుడు గాయపడిన సంఘటన ఆదివారం చౌడేపల్లె- సోమల మార్గంలోని ఆమినిగుంట వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. పీలేరుకు చెందిన లోకేష్ బైక్‌లో చౌడేపల్లెకు వచ్చాడు. పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా ఆమినిగుంట వద్ద ముందు వెళ్తున్న టిప్పర్ ను ఓవర్ టేక్ చేస్తుండగా టిప్పర్ ఒక్కసారిగా కుడివైపు తిరగడంతో బైక్‌పై దూసుకెళ్లింది. ఈఘటనలో గాయపడిన లోకేష్‌ను స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య కోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాకీ ముసుగులో యథేచ్ఛగా కబ్జా

పెద్దపంజాణి: వందేళ్ల చరిత్ర గల దారి (గ్రామ కంఠం)ని ఆక్రమించి దర్జాగా భవన నిర్మాణ పనులు చేస్తున్న ఖాకీని అధికారులు పట్టించుకోకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. వివరాలు.. పెద్దపంజాణి మండలం పెద్దకాపల్లె రెవెన్యూ గ్రామం తిప్పిరెడ్డిపల్లెలో 119/2 సర్వే నంబరులో 2.94 ఎకరాల గ్రామ కంఠం భూమి ఉంది. ఇందులో కొందరు పట్టాలు పొంది ఇంటి నిర్మాణాలు చేపట్టారు. అదే విధంగా మరికొంత మంది రైతులు ఇందులోని దారి గుండా వారి పొలాలకు, 119/3 సర్వే నంబరులో నిర్మించుకున్న ఇళ్లకు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఇటీవల పెద్దపంజాణి పోలీస్ స్టేషన్ హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న ప్రభురెడ్డి యథేచ్ఛగా దారిని ఆక్రమించి నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రశ్నించిన వారిపై ఖాకీ జులుం ప్రదర్శిస్తూ దురుసుగా ప్రవర్తిస్తున్నారు. దీనిపై గ్రామస్తులు ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఏఎస్‌ఐ చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఫలితం లేకపోవడంతో ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నారు.

• కల్యాణం.. కమనీయం

మండలంలో మొరం పంచాయతీ రామాపురంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం వివిధ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తజన సందడి నడుమ ప్రధాన అర్చకులు అనంత రామాచార్, రుత్వికులు క్రిష్ణమూర్తాచార్ కల్యాణోత్సవం నిర్వహించారు. రామాపురం, రంగినాయునిపల్లె, కమలాపురం గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

-పలమనేరు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

శరవేగంగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు



రంగులు వేస్తున్న సిబ్బంది

కాణిపాకం: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. స్వామివారి ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేస్తున్నారు. స్వామివారి రాజగోపురానికి, సుపథ మండపంలో, ఆలయం పరిసరాలలో ఎల్‌ఈడీ లైట్ల కటౌట్లు, విద్యుత్ ఎల్‌ఈడీ లైట్లు వెలుస్తున్నాయి. రంగులు వేసే పనులు శరవేగంగా సాగుతున్నాయి.



లైట్లు వేస్తున్న సిబ్బంది

విద్యుత్ తీగలు తగిలి లారీ దగ్ధం





లారీలో మంటలు చెలరేగుతున్న దృశ్యం, మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

- తృటిలో తప్పించుకున్న డ్రైవర్

తిరువళ్లూరు: తిరువళ్లూరు నుంచి పలమనేరుకు పశుగ్రాసంతో వెళుతున్న లారీకి విద్యుత్ తీగలు తగిలి లారీ దగ్ధమైంది. తిరువళ్లూరు జిల్లా తిరుప్పాచ్చూర్ పెద్దకాలనీకి చెందిన శంకర్. ఇతని పొలంలో ఇటీవలే వరికోత పూర్తయ్యింది. అనంతరం పశుగ్రాసాన్ని చిత్తూరు జిల్లా పలమనేరు ప్రాంతానికి చెందిన రాము అనే వ్యక్తికి విక్రయించాడు. ఇతను రెండు రోజుల క్రితం ఎండుకసువును 178 కట్టలు కట్టి పలమనేరుకు తరలించడానికి సిద్ధమయ్యాడు. ఆదివారం ఉదయం పలమనేరు నుంచి వచ్చిన లారీలో పశుగ్రాసాన్ని లోడ్ చేసి బయలుదేరాడు. లారీని పలమనేరుకు చెందిన ఆరీఫ్(22) నడిపారు. లారీ తిరుప్పాచ్చూర్ పాత కాలనీ వద్ద వెళుతుండగా పశుగ్రాసానికి విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. ఈ మంటలు క్షణాల్లో వ్యాపించాయి. లారీలో మంటలను గుర్తించిన స్థానికులు డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. అప్పటికే 30 పశుగ్రాసం కట్టలకు మంటలు అంటుకుని రోడ్డుపై పడ్డాయి. వెంటనే డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి లారీని 200 మీటర్లు ముందుకు వేగంగా నడిపి నిర్మానుష్య ప్రాంతంలో లారీ ఆపి దూకేశాడు. అప్పటికే మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం చేరవేశారు. సంఘటన స్థలానికి వచ్చిన సిబ్బంది 30 నిమిషాల పాటు శ్రమించి మంటలను ఆర్పారు. అయితే అప్పటికే లారీ, పశుగ్రాసం కాలిబూడిదయ్యాయి. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



ప్రత్యేక అలంకారంలో స్వామివారు

పుంగనూరు: శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ పురస్కరించుకుని యాదవ సంఘం ఆధ్వర్యంలో గోకులాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు శ్రీకృష్ణాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. కృష్ణమరెడ్డిపల్లె రోడ్డులోని ఆలయంలో సోమవారం వేకువజాము నుంచి హోమాలు, పూజలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల సౌకర్యార్థం షామియానాలు వేశారు. మంచి నీటి వసతి కల్పించారు. బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో అలంకరించారు. అలాగే ఆలయ సమీపంలో ఉట్టి కొట్టేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి కూడా యాదవులు ఈ వేడుకల్లో పాల్గొంటారని, యాదవులతో భజనలు, పిల్లనగ్రోవి, నృత్యాలు, గోమాతల ఊరేగింపు, పుష్పపల్లకి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

కుప్పంలో..

కుప్పం రూరల్: ప్రబోధానంద సేవా సమితి కుప్పం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కుప్పంలోని ప్యాలెస్ వద్ద శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి కృష్ణ తెలిపారు. ఉదయం స్వామి వారి ప్రతిమను ప్రతిష్ఠించి వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు ప్రబోధానంద రచించిన పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు కృష్ణ చెప్పారు. కార్యక్రమంలో నాగరాజు, ప్రకాశ్, కృష్ణారెడ్డి, వెంకటేష్, శివకృష్ణ, ఇందిర, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వీ.కోటలో..

వి.కోట: శ్రీ కృష్ణాష్టమి వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు శ్రీ కృష్ణ భక్త మండలి సభ్యులు ఆదివారం తెలిపారు. పట్టణంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి సోమవారం ఉదయం స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజల నంతరం స్వామి వారిని పల్లకిలో కొలువుదీర్చి పుర వీధుల్లో ఊరేగిస్తామని తెలియజేశారు.



కృష్ణమరెడ్డిపల్లె రోడ్డులో కృష్ణాష్టమి వేడుకలకు ముస్తాబైన శ్రీకృష్ణాలయం

ప్రవాహం వచ్చినా ఆగదు ప్రయాణం

మండలంలో పలు ప్రధాన రహదారుల మీదుగా గార్గేయనదీ పరీవాహక ప్రాంతాలు ఉండడంతో వర్షాకాలంలో ఇబ్బందులు తప్పేవి కాదు. వర్షాకాలంలో నీటి ప్రవాహం పెరిగితే పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయేవి. ఇప్పుడా ఇబ్బందుల్లేవని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో వంతెనలు నిర్మించడంతో నది ఉధృతంగా ప్రవహిస్తున్నా ప్రయాణానికి అవరోధం, రాకపోకల స్తంభన అనే మాటే లేదు.

- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో తీరిన సమస్య
- పలు చోట్ల వంతెనల నిర్మాణంతో ప్రయాణం సాఫీ
- గతంలో ఏరు సాగితే రాకపోకలు స్తంభన



జాండ్రపేట వద్ద కొట్టుకు పోయిన వంతెన (ఫైల్)

సదుం: మండల కేంద్రంలో పుంగనూరు, కలికిరి, పీలేరు మార్గాలలో వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు కలిగేవి. గార్గేయ ఉధృత ప్రవాహంతో పుంగనూరు మార్గంలో జాండ్రపేట వద్ద ఉన్న వంతెన 2020 నవంబర్‌లో కొట్టుకుపోయింది. దీంతో కలకటవారిపల్లె మీదుగా చుట్టుతిరిగి ఇరుకైన మార్గంలో వాహనాలు వెళ్లాల్సి వచ్చేది. ఇరుకు మార్గం కావడంతో ట్రాఫిక్ కూడా స్తంభించి వాహనదారులు అవస్థలు పడేవారు. ప్రవాహం తగ్గిన తరువాత రాకపోకల కోసం కొట్టుకుపోయిన వంతెన వద్ద తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేశారు. మళ్లీ 2021లో వచ్చిన ప్రవాహంతో అది కూడా కొట్టుకుపోయింది. అలాగే కలికిరి మార్గంలో సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద గార్గేయ నది ప్రవాహానికి, కంభంవారిపల్లె వద్ద పచ్చార్ల వంక ప్రవాహానికి చెక్‌డ్యామ్‌లపై నీరు ప్రవహించి రాకపోకలు స్తంభించేవి. పీలేరు మార్గంలో ఉన్న మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు పొంగి పొర్లితే ఆ మార్గంలోనూ ఇదే పరిస్థితి. ఫలితంగా రోగులు, రైతులు, విద్యార్థులు వ్యయప్రయాసలకోర్చి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వచ్చేది.

తీరిన ఇబ్బందులు

ప్రజల ఇబ్బందులు తెలుసుకున్న అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నూతన వంతెనల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. జాండ్రపేట వద్ద రూ.6.50 కోట్లు, కలికిరి మార్గంలో సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద రూ.10 కోట్లు, పచ్చార్ల వంకపై రూ.7 కోట్లు, పీలేరు మార్గంలో పాపిరెడ్డిగారిపల్లె క్రాస్ వద్ద రూ.7 కోట్లతో నూతన వంతెనల నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం వంతెనలపై వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. వరద ప్రవాహం వచ్చినా రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకపోవడం రవాణా సైతం పెరిగింది.

రాకపోకలకు అవస్థ పడాల్సిన పని లేదు



నీటి ప్రవాహ సమయంలో వంతెనలు లేకపోవడంతో మండల కేంద్రానికి చేరుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. కలికిరి మార్గంలో ఆలయం వద్ద, పచ్చార్ల వంకపై నూతనంగా రెండు వంతెనలు నిర్మించాక ఇప్పుడు ఎంత ప్రవాహం వచ్చినా రాకపోకలు స్తంభించే పరిస్థితి లేదు.

-శివారెడ్డి, కంభంవారిపల్లె, సదుం



పీలేరు మార్గంలో వంతెన



జాండ్రపేట వద్ద నూతనంగా నిర్మించిన వంతెన